క్లుప్తంగా...

విష్ణుపురికాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ

కీసర: నాగారం మున్సిపాలిటీ 9వ వార్డు విష్ణుపురికాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా జగదీష్, ప్రధాన కార్యదర్శిగా అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేష్, కోశాధికారిగా ఉమేష్, ఉపాధ్యక్షుడిగా కాకర్ల శ్రీనివాస్, వెంకటాచారి, రఘుపతి, జాయింట్ సెక్రటరీగా నాగదుర్గా, చైతన్య, స్వాతి, ఆర్గనైజేషన్ సెక్రటరీగా మమత, ప్రవీణ్, సందీప్, సలహాదారులుగా శంకర్‌రెడ్డి, వీరేశం, కృష్ణమాచార్యులు ఎంపికయ్యారు. నూతన కమిటీ సభ్యులను స్థానిక కౌన్సిలర్ కొమురెల్లి అనితా సుధాకర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం

మేడ్చల్: ఆర్టీసీ కార్మికులు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు మేడ్చల్ బస్టాండ్‌లో చలివేంద్రాన్ని డిపో మేనేజర్ సుధాకర్‌రావు ఆదివారం ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికులు, కార్మికులు దాహంతో ఇబ్బందులు పడకుండా చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

అన్నోజిగూడలో ..

పోచారం: అన్నోజిగూడలోని ఎన్టీపీసీ చౌరస్తా వద్ద సూర్యయూత్, వికలాంగుల కాలనీలో మొక్క ఉపేందర్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఆదివారం ఏర్పాటు చేశారు. వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు.

నియామకం



ఐజక్ ఇమ్మానియేల్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌టీపీ నేతలు

జవహర్‌నగర్: వైఎస్సార్ టీపీ అధినేత్రి వైఎస్. షర్మిల ఆదేశాల మేరకు జవహర్‌నగర్ కార్పొరేషన్ వైఎస్సార్‌టీపీ విద్యార్థి విభాగం కో–ఆర్డినేటర్‌గా తూమాటి ఐజక్ ఇమ్మానియేల్ నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌టీపీ మేడ్చల్ నియోజకవర్గం కో–ఆర్డినేటర్ పాకాల డానియేల్ ఆదివారం ఐజక్ ఇమ్మానియేల్‌కు నియామకపత్రం అందజేసి శాలువాతో సత్కరించారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కౌన్సిలర్, నిర్వాహకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మహంకాళి అమ్మవారి బోనాల జాతర వాల్‌పోస్టర్‌ను ఆదివారం కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ విడుదల చేశారు. ఆలయంలో నిర్వాహకులు, గ్రామస్తులతో కలిసి మే 6వ తేదీన నిర్వహించనున్న పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కిశోర్‌కుమార్, నాయకులు జగ్గారావు, అప్పలనాయుడు, క్రిష్ణ, గోపాల్, ఆంజనేయులు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గౌడవెల్లిలో మైసమ్మ ఉత్సవాలు



అమ్మవారి ఆలయం వద్ద నేతలు

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలోని మైసమ్మ ఆలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఉదయం ఆలయంలో గణపతి పూజ, పుణ్యావచనం, అమ్మవారికి అభిషేకం, అంలకరణ కార్యక్రమాలను నిర్వహించారు. పూజల అనంతరం అమ్మవారికి గ్రామస్తులు బోనాలను సమర్పించారు. అమ్మవారిని పీసీసీ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పద్మజగన్‌రెడ్డి, సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ తదితరులు దర్శించుకుని పూజలు చేశారు.

7న పద్మశాలి సంఘం సమావేశం

కీసర: నాగారం మున్సిపాలిటీలో 7వ తేదీన జరిగే పద్మశాలి సంఘం సమావేశాన్ని విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని నాగారం మున్సిపాలిటీ పద్మశాలి సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు అన్నారు. ఈమేరకు ఆదివారం నాగారంలో పద్మశాలి సంఘం ముఖ్యనేతలతో నిర్వహించిన సమావేశంలో పద్మశాలి సంఘం సమావేశాన్ని విజయవంతం చేసేలా సమావేశంలో చర్చించారు.



గృహం.. ఏదీ అనుగ్రహం?

- ఏడేళ్లుగా ఎదురుచూపులే..
- నత్తనడకన కొనసాగుతున్న నిర్మాణాలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

జవహర్‌నగర్‌లో ‘డబుల్’ ఇళ్లు ఎప్పుడిస్తారు?

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. జవహర్‌నగర్‌లో సర్వే నెం.829, 775, 776, 784, 720, 721, 722, 723, 725లలో దాదాపు 35 ఎకరాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పనులు మొదలై దాదాపు ఆరు సంవత్సరాలు గడుస్తోంది. ప్రస్తుతం 20 ఎకరాల్లో దాదాపు 2,240 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 15 ఎకరాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఇంకా చాలా పనులు చేయాల్సి ఉంది. ఇళ్లులేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చేసిన ప్రకటనలతో నిరుపేదలు తమ సొంత ఇంటి కల నెరవేరనుందని అనుకుంటున్న తరుణంలో పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో నిరాశకు గురవుతున్నారు. సంవత్సరాలు గడుస్తున్నా పనులు ఎప్పటికి పూర్తవుతాయి..? తమకు ఇళ్లు ఎప్పుడు ఇస్తారోనని లబ్ధిదారులు వేచి చూస్తున్నారు. ఏడాది క్రితం నుంచి ఇండ్ల నిర్మాణాలకు ఉపయోగించే సిమెంట్, ఐరన్, ఇసుక ధరలు విపరీతంగా పెరగటంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు ఆలస్యం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ నిర్లక్ష్యం



జవహర్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులు మొదలై ఏడు సంవత్సరాలు గడుస్తోంది. కేవలం ఎన్నిలు వచ్చినప్పుడు మాత్రమే పేదలకు మాయమాటలు చెప్పి కాలం వెల్లదీస్తున్నారు. జవహర్‌నగర్‌లో దాదాపు వందల కుటుంబాలు ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా ఉన్న వారికే ప్రాధాన్యం ఇవ్వాలి. డబుల్ బెడ్‌రూంల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. నెలలోపు ఇళ్లులేని నిరుపేదలందరికీ ఇళ్లు కేటాయించకపోతే ప్రజాప్రతినిధుల ఇళ్ల ఎదుట నిరసన వ్యక్తం చేస్తాం.

– మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, కాంగ్రెస్ జవహర్‌నగర్ అధ్యక్షుడు

ఏళ్లు గడుస్తోంది



రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడురూం కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఏడు సంవత్సరాల క్రితం చేసుకున్నాం. జవహర్‌నగర్‌లో 15 ఏళ్లుగా నిత్యం కూలీ పనులు చేసుకుని బతుకుతున్నాం. మాకు వచ్చిన డబ్బులన్నీ ఇండ్ల కిరాయిలకే సరిపోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం మమ్మల్ని గుర్తించి డబుల్ బెడ్‌రూంలు కేటాయించాలి.

– బి.పరమేశ్వరీ, జవహర్‌నగర్

కిరాయి కట్టలేకపోతున్నాం



ఎన్నికల సమయంలో ఇళ్లు లేని వారందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామన్నారు. సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఇళ్లు పూర్తిచేయలేదు. కిరాయి ఇళ్లలోనే జీవనం సాగిస్తున్నాం. నిరుపేదలందరినీ ప్రభుత్వం గుర్తించి ఇళ్లు ఇవ్వాలి.

– భాగ్యలక్ష్మి, బాలాజీనగర్

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

ఘట్‌కేసర్: సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు మేలు జరుగుతోందని సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్ అన్నారు. ఆదివారం కొర్రెముల్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉప సర్పంచ్ రాజుముదిరాజ్‌తో కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) చెక్కు అందజేశారు. కొర్రెముల్ సుప్రభాత్ టౌన్‌షిప్ కాలనీకి చెందిన మోహన్‌రావు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందగా ఆయనకు మంజూరైన రూ.45 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బాధితుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నాగార్జున, సత్యనారాయణముదిరాజ్, రవి పాల్గొన్నారు.

చలివేంద్రంలో కుండల ధ్వంసం అవివేకం

ఘట్‌కేసర్: అవుషాపూర్ సర్వీస్ రోడ్డు బస్టాప్ వద్ద వేసవిలో బాటసారులు, గ్రామస్తుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రంలో కుండలను ధ్వంసం చేయడం అవివేకమైన చర్య అని వైఎస్సార్ ట్రస్ట్ సభ్యుడు ఏనుగు మశ్చేందర్‌రెడ్డి అన్నారు. అవుషాపూర్ చలివేంద్రం వద్ద ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో చేస్తున్న మంచి పనులు చూసి ఓర్వలేక కుండలు పగులగొట్టారని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.



అవుషాపూర్ చలివేంద్రం వద్ద మాట్లాడుతున్న మశ్చేందర్‌రెడ్డి

రూ.కోటితో పార్కును అభివృద్ధి చేశాం

నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శిల్పావెంచర్‌లో సుమారు రూ.కోటి మున్సిపల్ నిధులను వెచ్చించి అభివృద్ధి చేసిన పార్కును ఆదివారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పరిశీలించారు. ఆదివారం సెలవుదినం కావడంతో పెద్దఎత్తున పార్కుకు వచ్చిన వారితో ఆయన మాట్లాడారు. సౌకర్యాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో ఉన్న పార్కులను ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేసేందుకు పెద్ద ఎత్తున మున్సిపల్ నిధులను వెచ్చిస్తున్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ నేత నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.



పార్కులో సౌకర్యాల గురించి తెలుసుకుంటున్న చంద్రారెడ్డి



అంత్యక్రియలకు ఆర్థిక సాయం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని పేదలకు ఆపద సమయంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధికి చెందిన దర్గా లక్ష్మణ్ కుమారుడు మృతి చెందడంతో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో అన్నంరాజు శ్రీనివాస్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను మరింత అభివృద్ధి చేద్దాం

బోడుప్పల్: బీఆర్‌ఎస్ అభివృద్ధికి కార్యకర్తలు, నాయకులు కృషి చేద్దామని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, పార్టీ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి అన్నారు. బొమ్మక్ బాలయ్య ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన డివిజన్ అధ్యక్ష, కార్యదర్శుల సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25వ తేదీన వైభవంగా వేడుకలను నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు.జెండా పండగను నిర్వహించి అనంతరం జిల్లాలో జరిగే ప్లీనరీ సమావేశానికి తరలివెళ్దామని పిలుపునిచ్చారు. కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్, చీరాల నర్సింహ, సింగిరెడ్డి పద్మారెడ్డి, నేతలు పులకండ్ల జంగారెడ్డి, కొత్త రవిగౌడ్, గుర్రాల వెంకటేశ్ యాదవ్, మీసాల కృష్ణ, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.



మర్రి రాజశేఖర్‌రెడ్డి దంపతులకు ఆశీర్వచనం



కీసర: బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కీసరగుట్ట వేదపండితులు ఆదివారం నగరంలోని ఆయన నివాసానికి తరలివెళ్లి మర్రి రాజశేఖర్‌రెడ్డి దంపతులకు కీసరగుట్ట స్వామివారి ఆశీర్వచనంతో పాటు, మహాప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ, బీఆర్‌ఎస్ నేతలు రామిడినరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి సమ్మెకు వెళ్తాం

మేడ్చల్: సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ శాఖలో ఈ నెల 25వ తేదీ నుంచి సమ్మెకు వెళ్తామని తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ హెచ్–82 యూనియన్ మేడ్చల్ డివిజన్ నాయకులు అన్నారు. యూనియన్ నాయకులు మేడ్చల్‌లో విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న 23వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను సంస్థ ఉద్యోగులుగా ప్రభుత్వం గవర్నర్ ప్రసంగంలో చెప్పిందని, మాటలు చేతల రూపం దాల్చకుండా పోయాయన్నారు. తమ డిమాండ్ల సాధనకు ఈ నెల 25వ తేదీ నుంచి సమ్మె చేస్తామని తెలిపారు. సమ్మెలో నిరసనలు, ధర్నాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని నాయకులు తెలిపారు. సమావేశంలో యూనియన్ డివిజన్ నాయకులు రాంబాబు, అలీ, పద్మారావు, రాము, శేఖర్, ప్రభు, ఆంజనేయులు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల



ఘట్‌కేసర్: పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమం, మహాత్మ బసవేశ్వర జయంతిని ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి, బసవేశ్వర చిత్రపటానికి పూలమాల వేశారు. ముఖ్యఅతిథులుగా సాయిగూడెం ఫ్రెండ్స్‌యూత్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి భాస్కర్, శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి ఉపేందర్ హాజరయ్యారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, మేకల దాసు, నారాయణ, గణేశ్, బాలయ్య, మల్లేశ్, ఆనంద్, పవన్, అఖిల్, శ్రీకాంత్, నిఖిల్, సాయికిరణ్, భరత్‌కుమార్, ప్రశాంత్, శివ, ఉపేందర్, కష్ణంరాజు, లింగం పాల్గొన్నారు.

నేటినుంచి ఇంటింటికీ సీపీఐ ప్రజాచైతన్య పాదయాత్ర



జవహర్‌నగర్‌లో ఇంటింటికీ సీపీఐ ప్రజాచైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తూ..

జవహర్‌నగర్: భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఆధ్వర్యంలో బీజేపీ కో హఠావో – దేశ్ కో బచావ్ పేరుతో సోమవారం నుంచి 29వ తేదీన వరకు మేడ్చల్ నియోజకవర్గం మేడిపల్లి నుంచి జవహర్‌నగర్‌కు వరకు నిర్వహించే ఇంటింటికీ సీపీఐ ప్రజాచైతన్య పాదయాత్రను విజయవంతం చేయాలని సీపీఐ మేడ్చల్ నియోజకవర్గం కార్యదర్శి తోటపల్లి శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం జవహర్‌నగర్‌లో పాదయాత్ర పోస్టర్‌ను ఆయన సీపీఐ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల దేశ సమైక్యత, సమగ్రతలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ఈ ప్రమాదాలను సీపీఐ ఆధ్వర్యంలో ఇంటింటికీ వివరిస్తామన్నారు. పాదయాత్రకు సీపీఐ నాయకులతో పాటు కార్మిక, మధ్య తరగతి ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువజన నిరుద్యోగులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు హాజరై సంఘీభావం తెలపాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్‌రావు, కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, నాయకులు రాజేశ్వరి, స్వరూప, లత, ఎల్లయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దళితసేన నూతన కమిటీ ఉన్నిక

శామీర్‌పేట్: దళిత సేనా శామీర్‌పేట మండల నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగిందని దళిత సేనా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంకి మల్లేష్ తెలిపారు. శామీర్‌పేట మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న అంబేడ్కర్ స్థలి వద్ద ఆదివారం ఉమ్మడి శామీర్‌పేట మండల దళిత సేనా కార్యవర్గ సమావేశం నిర్వహించి తూంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. దళితసేన శామీర్‌పేట మండల అధ్యక్షుడిగా వజ్జెల మురళీ, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా మేడి భిక్షపతి, ఉపాధ్యక్షులుగా గజ్జెల రాజయ్య, కనుకాల బాల్‌రాం, బోయిని రాజు, దప్పు డేవిడ్, ప్రధాన కార్యదర్శిగా నీరుడి బాలేష్, ప్రచార కార్యదర్శులుగా శ్రీనివాస్, శ్రీకాంత్, కోశాధికారిగా ఆంజనేయులు, కార్యనిర్వహణ కమిటీ సభ్యులుగా పరుశరాం, వీరేష్, భాస్కర్, శ్యామ్, కాళిదాస్, బాలు, వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. తూంకుంట మున్సిపాలిటీ అడక్ కమిటీ సభ్యులుగా రమేష్, మోహన్‌కృష్ణ, స్వామి, శివకుమార్, మధు, శివ, సీహెచ్ గిరి, శ్యామ్, గణేష్, మూడుచింతలపల్లి అడక్ కమిటీ సభ్యులుగా వెంకటేష్, జహంగీర్, లక్ష్మయ్య, రాములు, ఆగమయ్య, తిరుమలయ్యలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.



దళితసేనా శామీర్‌పేట మండల నూతన కమిటీ సభ్యులు

వృద్ధాశ్రమంలో అన్నదానం

జవహర్‌నగర్: మేడ్చల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్‌ఆర్) జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం జవహర్‌నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నాయకులు టి.కాలేష ఆధ్వర్యంలో జవహర్‌నగర్‌లోని ఆదర్శ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఓల్డేజ్ హోమ్‌లో పండ్లను పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన కేఎల్‌ఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాలేష కుటుంబసభ్యులు షర్మిల, షేక్.ముర్తుజా హైదర్, అజ్మతుల్ హైదర్, నురుల్ ఐన్ ఫాతిమా, సూరజ్, మహ్మద్, మోయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న కాలేషా కుటుంబసభ్యులు

ఈటల దిష్టిబొమ్మ దహనం

మేడ్చల్: కాంగ్రెస్ పార్టీపై, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ నాయకులు మేడ్చల్ నిరసన ర్యాలీ నిర్వహించి ఈటల దిష్టిబొమ్మను దహనం చేశారు. 44వ జాతీయ రహదారిపై ఈటల దిష్టిబొమ్మను ఊరేగించి వివేకానంద విగ్రహం వద్ద దహనం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్‌రెడ్డి, మండల, జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



మేడ్చల్‌లో ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

అరజెన్ కంపెనీలో అగ్ని ప్రమాదం

మల్లాపూర్: నాచారం పారిశ్రామికవాడలోని అరజెన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఆదివారం మధ్యాహ్నం రియాక్టర్ నుంచి మరో రియాక్టర్‌కు సాల్వెంట్ వెళ్లే క్రమంలో లీకు కావడంతో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో కాసేపు మంటలతో పాటు దట్టమైన పొగ వ్యాపించింది. కంపెనీలో పనిచేసే కార్మికులు, చుట్టుపక్కల వారు ఆందోళన గురయ్యారు. ఘటన స్థలానికి చేరుకున్న రెండు ఫైర్ ఇంజిన్లు దాదాపు గంట పాటు శ్రమించి మంటలను ఆర్పేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అగ్ని ప్రమాదాన్ని కవర్ చేసేందుకు వెళ్లిన మీడియాను లోపలికి అనుమతించలేదు.



త్వరలో రాష్ట్రంలో అవినీతి పాలన అంతం

టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్



ఏదులాబాద్‌లో హాథ్ సే హాథ్ జోడో యాత్రను ప్రారంభిస్తున్న వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్: రాష్ట్రంలో కొనసాగుతున్న కుటుంబ, అవినీతి పాలనను గద్దెదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఘట్‌కేసర్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఏదులాబాద్‌లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శ్రీరంగనాయక స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం యాత్రను ప్రారంభించారు. వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతి కోరల్లో చిక్కుకున్నాయని, వాటికి పతనం ప్రారంభమైందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, తెలంగాణలో సాగుతున్న అరాచక పాలనపై ఏ ఒక్కవర్గం సంతృప్తికరంగా లేదన్నారు. రాష్ట్రంలో కబ్జాల పర్వం సాగుతోందని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమన్నారు. యాత్రలో భాగంగా ఏదులాబాద్, మాదారం, మర్పల్లిగూడలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మేడ్చల్ యాత్ర ఇన్‌చార్జ్ వెంకటేశ్, టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి సరిత, గజ్వేల్ సమన్వయకర్త మహేందర్‌రెడ్డి, జవహర్‌నగర్ కార్పొరేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, ఏ, బీ బ్లాక్ అధ్యక్షుడు పోచయ్య, మహేశ్‌గౌడ్, స్థానిక వైస్ ఎంపీపీ జంగమ్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్, అధికార ప్రతినిధి మాధవరెడ్డి, ముత్యాలుయాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనిత, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, స్థానిక శాఖ అధ్యక్షుడు అమర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.